క్లుప్తంగా

సమస్యల పరిష్కారం కోరుతూ వినతి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వెలగపూడి వెళ్లిన ఎమ్మెల్యే గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి నియోజకవర్గ సమస్యలు, పెండింగ్ పనులపై విన్నవించారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వరి పొలాల పరిశీలన



కరకుదురులో వరి పొలాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేస్తున్న కరుణాకరరావు

పెదపూడి: నిబంధనల ప్రకారం ఈ–క్రాప్ నమోదు పూర్తి చేసిన పొలాలను పరిశీలిస్తున్నామని కాకినాడ మత్స్య శాఖ ఏడీ ఎ.కరుణాకరరావు తెలిపారు. పెదపూడి, పెద్దాడ, దోమాడ, కరకుదురు గ్రామాల్లో ఈ–క్రాప్ పూర్తయిన వరి పొలాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ పరిశీలన చేస్తున్నామన్నారు. ఈ నమోదులో ఎక్కడైనా వరి పొలాలకు బదులుగా చేపలు, రొయ్యల చెరువులు గాని నమోదు చేశారా అనేదానిపై అక్కడక్కడ సూపర్ చెక్ చేస్తున్నామన్నారు. తహసీల్దార్ టి.సుభాష్, మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

రంగంపేట: మండలంలోని రైతులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కూరాకుల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ 15వ విడత నగదు త్వరలో రైతుల ఖాతాలకు జమ కానుందని, ఆ నగదు లబ్ధి పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అన్నారు. మండలంలో ఇప్పటి వరకూ సుమారు 6,700 మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నారని, ఇంకా 540 మంది చేయించుకోలేదన్నారు. వారంతా మరో నాలుగు రోజుల్లో నమోదు కావాలని సూచించారు. లేకపోతే పీఎం కిసాన్ నగదు జమ కాదన్నారు. ఈకేవైసీ నమోదు కాని రైతుల వివరాలను అన్ని రైతుభరోసా కేంద్రాల వద్ద ఉంచామన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పరుగు పందెం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అనపర్తి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించే వివిధ క్రీడా పోటీలు, అథ్లెటిక్స్‌కు నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపికలు స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగాయి. అండర్–14, 17 విభాగాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన బాల బాలికల జట్లను ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం నిర్వహించిన ఈ ఎంపికలకు మొత్తం 280 మంది బాల బాలికలు హాజరయ్యారన్నారు. ఇదిలా ఉండగా మహాత్మా జ్యోతీరావ్‌పూలే బీసీ సంక్షేమ వసతి గృహానికి చెందిన 23 మంది విద్యార్థులు అథ్లెటిక్స్, వివిధ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జి.అఖిల తెలిపారు.

వైభవంగా ముగిసిన పారాయణ యజ్ఞం



సాయిసచ్చరిత్ర పుస్తకాలను అందుకుంటున్న భక్తులు

రాజానగరం: లోకకల్యాణం, ప్రపంచ శాంతిని కోరుతూ స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో 12 గురువారాలు చేపట్టిన పారాయణ యజ్ఞం ఈ వారంతో వైభవంగా ముగిసింది. సాయిభక్త మండలి ఆధ్వర్యంలో 11 గురువారాలు గురు చరిత్రను, 12వ వారం సాయి సచ్చరిత్రను పారాయణ చేశారు. వేకువజామున బాబాకు కాకడ హారతి ఇచ్చిన అనంతరం పారాయణ కార్యక్రమాన్ని ప్రారంభించి, సాయంత్రం వరకూ ఒక్కొక్కరు ఒకటి, రెండు, మూడు అధ్యాయాలను పారాయణ చేస్తూ 52 అధ్యాయాలను పూర్తి చేసేవారు. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ పారాయణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ సాయి సచ్చరిత్ర పుస్తకాలను నిర్వాహకులు కానుకగా అందజేశారు. ఎప్పటిలాగే మధ్యాహ్న హారతి అనంతరం అన్నసమారాధన జరిగింది.

పచ్చని పరదా.. పాముల బెడద

- పెరుగుతున్న పాముకాట్లు
- రైతులు, కూలీలకు ఇబ్బందులు
- పీహెచ్‌సీల్లో యాంటీ స్నేక్ వీనమ్ వ్యాక్సిన్



బూరుగుపూడిలో పశుగ్రాసం కోస్తున్న రైతు



జంబూపట్నంలో కలుపు తీస్తున్న వ్యవసాయ కూలీలు

మధురపూడి: వ్యవసాయ సాగులో రైతన్నలకు పాముల బెడద తీవ్ర సమస్యగా ఉంది. నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో 16,698 హెక్టార్ల విస్తీర్ణంలో వరిని సాగు చేస్తున్నారు. పొలంగట్లపై పెరిగిన పచ్చగడ్డిలో పాముల సంచారం ఎక్కువగా ఉంటుంది. రైతులు పశువులకు దాణా కోసం ఆ గట్లపై గడ్డిని కోస్తారు. అలాగే సాగు పనులు చేస్తారు. ఆ సందర్భంలో పాముకాటుకు గురవుతున్నారు. పొలాల్లో కలుపుతీత పనులు నిర్వహిస్తున్న సమయంలో ఈ ప్రమాదం పొంచి ఉంది. కలుపుతీత పనులు ఉదయం 6 గంటల నుంచి మొదలవుతుంటాయి. అది పాముల సంచారానికి అనువైన సమయం. ఈ సందర్భంలో పలువురు పాముల కాటుకు గురవుతున్నారు. పాముకాటు బాధితులను కాపాడటానికి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో యాంటీ స్నేక్ వీనమ్ మందును రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. అలాగే దీనిపై రైతులు, వ్యవసాయ కూలీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది.

ప్రమాదకరమైన పాములివే..

పాముల్లో అనేక రకాలున్నప్పటికీ ప్రమాదకరమైనవి కొన్ని మాత్రమే. విషం గల తాచపాము, కట్ల పాము, పొడ పాము ప్రమాదకరమైనవి. ఇవి కరిస్తే సమస్య తీవ్రంగా ఉంటుంది. బాధితులకు వీలైనంత త్వరగా ప్రథమ చికిత్స చేయించాలి. పాముల నోట్లోని ద్రవాలు రక్తంలోకి వెళ్లడంతో రక్త కణాలు పాడవుతాయి. కనుక విషపూరితమైన పాములు కరిస్తే 20 నిమిషాలలోపే వైద్యం చేయించాలి. విషం లేని బురద, పసర, తాడేలు పాములు కరిస్తే నాలుగు గంటల లోపు వైద్యం అందించాలి.



అందుబాటులో వైద్యం



పీహెచ్‌లకు పాముకాటు కేసులు సుమారు 3 చొప్పున వస్తున్నాయి. అన్ని పీహెచ్‌సీల్లో యాంటీ స్నేక్ వీనమ్ మందును అందుబాటులో ఉంచారు. రాష్ట్ర ప్రభుత్వం వర్షాకాలం ప్రారంభానికి ముందే వీటిని అందుబాటులోకి తీసుకువచ్చింది. కరిచిన వెంటనే ఆ పామును గుర్తించాలి. సత్వరమే వైద్యం చేయించుకోవాలి.

– డాక్టర్ రవిచంద్ర, కోరుకొండ పీహెచ్‌సీ

అప్రమత్తంగా ఉండాలి



వ్యవసాయ పనులు చేసేటప్పుడు రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి. పాములతో సమస్య ఎక్కువగా ఉంటుంది. పాములు, కుక్క, కోతి దాడి చేస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలి. బాధితులకు అవసరమైన అన్ని రకాల మందులను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది.

– పసుపులేటి బుల్లియ్య నాయుడు, కోరుకొండ

వరద నీటితో..



కొండ గోదావరి వరద నీరు పొలాల్లోకి చేరడంతో పాములు చేరాయి. వీటిలో ప్రమాదకరమైన పాములున్నాయి. గోదావరి వరద కారణంగా చేరినవి కొన్నయితే, పరిసర ప్రాంతం నుంచి వచ్చినవి మరికొన్ని ఉన్నాయి.

– మద్దాల చంటిబాబు, బుచ్చెంపేట

ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ



గంగంపాలెంలో ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న అంబుడ్స్‌మెన్ జ్యోతి

గోకవరం: మండలంలోని గంగంపాలెంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగాయని వచ్చిన ఫిర్యాదుపై అంబుడ్స్‌మెన్ ఎం.జ్యోతి గురువారం విచారణ నిర్వహించారు. గ్రామంలోని చెరువు పనుల్లో 67 మందికి దొంగ మస్తర్లు వేసి అవకతవకలకు పాల్పడ్డారని ఇటీవల జరిగిన సోషల్ ఆడిట్‌లో పలువురు గ్రామస్తులు డ్వామా పీడీ పి.జగదాంబకు ఫిర్యాదు చేశారు. దీనిపై డ్వామా పీడీ విచారణకు ఆదేశించగా అంబుడ్స్‌మెన్ విచారణ చేపట్టారు. ఉపాధి కూలీలను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా అంబుడ్స్‌మెన్ జ్యోతి మాట్లాడుతూ తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహిస్తున్నామన్నారు. విచారణ ఇంకా పూర్తికాలేదని, చెరువులో చేపట్టిన ఉపాధి పనులపై సాంకేతికపరంగా కూడా విచారణ నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, ఉపాధి ఏపీఓ శేషఅప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



దొడ్డిగుంటలో అర్హులకు పింఛన్లు అందిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు

రంగంపేట: ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు అందిస్తుందని అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు అన్నారు. దొడ్డిగుంట గ్రామ సచివాలయం వద్ద పెద్ద దొడ్డిగుంట, చిన్న దొడ్డిగుంట గ్రామాలకు కొత్తగా మంజూరైన 32 పింఛన్లను సర్పంచ్ కారి సంజీవరావుతో కలసి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదని, జగనన్న ప్రభుత్వంలో కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నారన్నారు. ఎంపీటీసీ మడికి లక్ష్మి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ తోట వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ మల్లెల వీరరాఘవ, కొండేపూడి వెంకట్రావు, ఉప సర్పంచ్ పంట వీరబాబు, కార్యదర్శి మణికుమార్ పాల్గొన్నారు.

వివేకానందుని బోధనలు యువతకు మార్గదర్శకం

ప్రముఖ ప్రవచనకర్త చాగంటి




వివేకపథం-2024 ఫోల్డర్‌ను ఆవిష్కరిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

అనపర్తి: స్వామీ వివేకానందుని బోధనలు నేటి యువతకు మార్గదర్శకమని, ప్రతి విద్యార్థి వివేకానందుని సాహిత్యాన్ని తప్పనిసరిగా అధ్యయనం చేయాలని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో 'వివేకపథం -2024' పేరిట రూపొందించిన స్వామీ వివేకానంద జీవితం–సందేశం ఫోల్డర్‌ను చాగంటి ఆవిష్కరించి తొలి ప్రతిని సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డికి అందజేశారు. గురువారం కాకినాడలోని చాగంటి గోశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వామి సందేశం, ఆయన భావజాలం ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయన్నారు. ఆదర్శవంతమైన జీవితం గడిపిన వారి జన్మ చరితార్థమని, దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు వివేకానందుడని అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా విద్యార్థుల్లో స్ఫూర్తి నింపే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి సభ్యులను అభినందించారు. రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఏటా అనపర్తి మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు వివేకపథం ఫోల్డర్‌ను అందించి వాటిపై పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేట్లపాలెం శ్రీరామకృష్ణ సేవా సమితి కార్యదర్శి కంటిపూడి గోపాలకృష్ణ, సమితి ఉపాధ్యక్షులు తేతలి సుందరరామారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, సత్తి వెంకటరెడ్డి, కార్యదర్శులు నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, తాడి చంద్రశేఖర్‌రెడ్డి, కొవ్వూరి సత్తిరెడ్డి, మల్లిడి సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జై గణేశ.. శ్రీ గణేశ



కొంకుదురులో గణపతి పూజలు చేస్తున్న భక్తులు



రామేశ్వరంలో వినాయకస్వామికి పూజలు

బిక్కవోలు: వినాయక నవరాత్ర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక లక్ష్మీగణపతి ఆలయం వద్ద స్వామివారిని గురువారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక అభిషేకాలు, హోమాలు చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధనను ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీరవెంకట సుబ్బారెడ్డి, విశాలక్ష్మి దంపతులు ప్రారంభించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఎస్‌పేట మాజీ సర్పంచ్ యామన దుర్గారావు పాల్గొన్నారు. కొంకుదురు వెలంపేటలో లక్ష్మీగణపతి ఆలయం వద్ద స్వామివారి హోమం ఘనంగా జరిగింది. రమణశర్మ ఆధ్వర్యంలో సుమారు 200 మంది భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ రొంగల పద్మావతి, అప్పాజీ దంపతులు పాల్గొన్నారు.

పెదపూడి: గణపతి ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు వినాయక మండపాల్లో స్వామివారికి గణపతి హోమం, పంచామృతాభిషేకాలు చేశారు. రామేశ్వరంలో రుద్రాక్ష వినాయక స్వామిని వేల సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు. అక్కడ దాత నడింపల్లి సూర్యనారాయణ శ్రీనురాజు, సీతామణి దంపతులు పూజల్లో కూర్చున్నారు. గణపతి పూజ, మంటపారాధన, స్వామివారికి సహస్ర పుష్పార్చన, వేదస్వస్తి, చతుర్వేద స్వస్తి తదితర పూజలు చేశారు. అనంతరం ప్రసాద వితరణ గావించారు. సర్పంచ్ కొటికలపూడి చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన రిలే నిరాహార దీక్షలు



గోకవరంలో ర్యాలీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గోకవరం: పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు గోకవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సంఘ నాయకులు తహసీల్దార్ కార్యాలయం నుంచి దేవీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఎస్సీవర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు పెరవలి పండు, గెడ్డం అనిల్, పెరవలి శ్యామల్‌రావు, చీకట్ల సత్యానంద్, బాతు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోకవరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపట్టడంతో శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఏఈ అశోక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని గోకవరం, కృష్ణునిపాలెం, రామన్నపాలెం, కొత్తూరు, ఆర్ అండ్‌ఆర్ కాలనీ, కొత్తపల్లి, జగన్నాథపురం, కామరాజుపేట, మల్లవరం, సూదికొండ, వీరలంకపల్లి, గంగంపాలెం, రంపయర్రంపాలెం, ఠాకూరుపాలెం, పెంటపల్లి తదితర గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

డ్వాక్రా మహిళలకు ఆర్థిక ఆసరా

- మహిళా సాధికారతే సీఎం జగన్ లక్ష్యం
- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి



వంగలపూడిలో డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: రాష్ట్రంలో డ్వాక్రా మహిళలకు ఆర్థిక ఆసరా కల్పించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని వంగలపూడి, సింగవరం, రఘుదేవపురం, నల్గొండ, కూనవరాల్లో డ్వాక్రా మహిళా సంఘాలతో గురువారం సమావేశాలు నిర్వహించారు. వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, అమ్మ ఒడి, చేదోడు పథకం తదితర వాటిని వివరించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ 2014లో రాష్ట్రాన్ని బాగుచేస్తానంటూ చంద్రబాబు ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. అయితే జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేశారన్నారు. కుల, మత, ప్రాంతాలు, రాజకీయాలు, వర్గాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సాయం అందజేస్తున్నారన్నారు. గతంలో తన భర్త జక్కంపూడి రామ్మోహనరావుకు నియోజకవర్గ ప్రజలందరూ అండగా నిలిచారని, ప్రస్తుతం జక్కంపూడి కుటుంబానికి అండగా నిలుస్తున్నందుకు పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, సర్పంచ్‌లు కొంచ అన్నపూర్ణ, ఇందుగుమిల్లి చంద్రలీల, నేతల స్నేహప్రియ, సుంకర గంగాలక్ష్మి, ఎంపీటీసీలు సూరెడ్డి గంగా భవాని, కుమ్మరశెట్టి వెంకటేశ్వరరావు, యలమాటి లలిత శిరీష, నల్లమోలు భాస్కర్, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, కొంచ భాస్కరరావు, మద్దిపాటి శివకుమార్ పాల్గొన్నారు.

గురజాడ అడుగుజాడల్లో నడవాలి



కొంకుదురులో గురజాడకు నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బిక్కవోలు: ప్రజల్లో దేశభక్తిని నింపిన మహనీయుడు గురజాడ అప్పారావు అడుగుజాడల్లో యువత నడవాలని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆ పాఠశాల ఆవరణలో గురజాడ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్య వివాహాలు వంటి సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి ఆయన కన్యాశుల్కం రచించారన్నారు. ఉపాధ్యాయులు చౌదరి, పడాల ఈశ్వర్‌రెడ్డి, లక్ష్మణరెడ్డి, అప్పారావు, జ్యోతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థినికి కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో 360 మంది విద్యార్థులకు గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఎం ఎం.వీరభద్రరావు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరానికి చెందిన గౌతమీ నేత్రాలయం సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఈవో కె.స్వామి నాయక్ పాల్గొన్నారు. డాక్టర్లు హర్షవర్షిణి, ఎ.సతీష్, ఎం.సురేష్ కంటి పరీక్షలు జరిపారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

రైతు నేస్తం రుణాలు సత్వరమే అందించాలి



సీతానగరంలో మాట్లాడుతున్న డీసీసీబీ డీజీఎం శ్రీధర్

సీతానగరం: పీఏసీఎస్‌ల ద్వారా రైతు నేస్తం రుణాలను సంఘం సభ్యులకు సత్వరమే అందించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ డీజీఎం మద్దిపాటి శ్రీధర్ సూచించారు. గురువారం సీతానగరం పీఏసీఎస్ ఆవరణలో కోరుకొండ, సీతానగరం, తొర్రేడు పరిధిలోని పీఏసీఎస్ సీఈవోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీజీఎం శ్రీధర్, ఏజీఎం వైసీహెచ్ శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ సీసీ దాసరి సూర్యం, నోడల్ ఆఫీసర్ ఎస్.ఉమారాణి పాల్గొన్నారు. డీజీఎం శ్రీధర్ మాట్లాడుతూ రైతు నేస్తంలో ఎకరానికి రూ. 8 లక్షల చొప్పున రూ. 40 లక్షల వరకూ రుణంగా అందించవచ్చన్నారు. దీనికి పదేళ్ల కాలపరిమితితో 12 శాతం వడ్డీతో చెల్లించాలన్నారు. అలాగే దీర్ఘకాలిక రుణాలు బోరు, మోటారు ఏర్పాటుకు ఎకరానికి రూ.3.42 లక్షలు అందిస్తామని, తొమ్మిదేళ్ల కాలపరిమితితో 11.85 శాతం వడ్డీతో చెల్లించాలన్నారు. ల్యాండ్ డవలప్‌మెంట్‌కు ఎకరానికి రూ.2.50 లక్షలు, అర ఎకరం ఉంటే మేకలు, గొర్రెలకు రూ.2.05 లక్షలు, బండి ఎద్దులకు రూ.1.03 లక్షలు, దీర్ఘకాలిక రుణంగా ఎకరానికి రూ.4 లక్షలు అందిస్తామని, కాలపరిమితి ఐదేళ్లుండగా 11.85 శాతం వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏజీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ షార్ట్ టర్మ్ అథర్స్‌లో ఎకరానికి రూ.2.50 లక్షలు రుణంగా పొంది, 12 శాతం వడ్డీతో ప్రతి ఏడాది చెల్లించి రెన్యూవల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. షార్ట్ టర్మ్ లోన్‌లో ఎకరానికి వరికి అయితే రూ.42 వేలు, కందకు రూ.1.50 లక్షలు, అరటికి రూ.85 వేలు రుణం తీసుకుని 7 శాతం వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రఘుదేవపురం డీసీసీబీ చీఫ్ మేనేజర్ కార్తీక రెడ్డి, పీఏసీఎస్ మేనేజర్ సుల్తాన్, కోరుకొండ పీఏసీఎస్ మేనేజర్ జి.అప్పారావు పాల్గొన్నారు.

నేడు విజ్ఞాన ప్రదర్శన

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలోని లారెల్ హై గ్లోబల్ స్కూల్లో శుక్రవారం సాయంత్రం విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నారు. దీనికి ముఖ్యఅతిథిగా ప్రముఖ డిఫెన్స్ ఎయిర్‌స్పేస్ విజ్ఞాన శాస్త్రవేత్త సతీష్ రెడ్డి హాజరవుతున్నట్టు స్కూల్ యాజమాన్యం తెలిపింది.

గణనాథుని విగ్రహ నిమజ్జనం

రాజానగరం: స్థానిక బాలుర వసతి గృహంలో ఉంటున్న కళాశాల విద్యార్థులు తమ వసతి గృహం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణనాథుని గురువారం నిమజ్జనం చేశారు. భక్తిశ్రద్ధలతో ఐదురోజులు పూజలు చేసి, అనంతరం నిమజ్జనం చేశారు.

హిందీ పఠనంపై పోటీలు

రాజానగరం: హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని దివాన్ చెరువులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు హిందీ పఠనం, అవగాహనపై గురువారం పోటీలు నిర్వహించారు. హిందీ బోధకురాలు మెహరున్నీసా బేగం పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలలో విజేతలకు మొక్కలను బహుమతిగా అందజేశారు.

ముగిసిన క్రీడా పోటీలు

రాజానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ టోర్నమెంట్స్ గురువారంతో ముగిశాయి. అండర్ 17, 14 విభాగాలలో మొదటి రోజున బాలురకు, రెండో రోజున బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్, యోగా, అథ్లెటిక్స్‌లో ఈ గేమ్స్ కమ్ సెలక్షన్స్ జరిగాయని ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ తెలిపారు. సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఎంపికైన వారిని జిల్లా పోటీలకు పంపిస్తామన్నారు.